## తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిలో సిటి స్కాన్ ప్రారంభించిన మంత్రి పొన్నం



ఆర్టీసీ హాస్పిటల్లో సిటీ స్కాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం, చిత్రంలో ఎండి.సజ్జనార్ ఇతర అధికారులు, డాక్టర్లు

**తార్నాక, జులై 20 ప్రభాతవార్త:** తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రిలో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన సిటిటీ స్కాన్ సెంటర్‌ను రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అదేవిదంగా ఎంఆర్ఐ ఆధునిక వైద్య పరీక్షా కేంద్రాలతో పాటు ఫిజియోథెరఫీ యూనిట్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, ఫార్మసీని కూడా ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో కలియ తిరిగారు. చికిత్స కోసం వచ్చిన ఆర్టీసీ సిబ్బందితో ఆయన ముచ్చటించి ఏమైనా సమస్యలున్నాయా అని అడిగారు. అనంతరం ఆర్టీసీ ఆసుపత్రి వైద్యులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. సిబ్బందికి అందిస్తోన్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలను నాటారు ఈ కార్యక్రమంలో టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఆర్టీసీ ఆసుపత్రి సూపరెండెంట్ డా. శైలజా మూర్తి, డా. శ్రీనివవాస్ సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# హైదరాబాద్ వార్త





# ఎడతెరిపి లేకుండా వర్షం ..

**-స్తంభించిన జనజీవనం -లోతట్టు ప్రాంతాలు జలమయం**

**-నిండుకుండలా మారిన జలాశయాలు -అప్రమత్తమైన జిహెచ్‌ఎంసి, డిఆర్ఎఫ్ బృందాలు**

**-వాటర్ లాగిన్‌పాయింట్ల వద్ద నీటి తొలగింపు**



**హైదరాబాద్, జూలై 20,ప్రభాతవార్త:** భాగ్యనగరంలో ఎడతెరిపి లేని వాన కురుస్తుంది. శుక్రవారం రాత్రి ప్రారంభమైన వర్షం శనివారం రోజంతా కురిసింది. దీంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. పలు ఏరియాల్లో నాలాల్లో నీరు ఉధృతంగా ప్రవహించిది. దీంతో అధికారులకు సమీప ప్రాంతాల ప్రజలను అలెర్ట్ చేశారు. అలాగే పలుప్రాంతాల్లో రోడ్లపై వర్షం కురిసి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో జిహెచ్‌ఎంసి, డిఆర్ఎఫ్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ అమీర్‌పేట్, బోరబండ, యూసుఫ్ గూడ, ఈఎస్ఐ, సనత్‌నగర్, ఎస్సార్‌నగర్ ,కృష్ణానగర్ ,ఎల్బీనగర్, దిల్‌షుఖ్‌నగర్ పరిసర ప్రాంతీఆల్లో వర్షం కురిసింది. అలాగే కోఠి ,సుల్తాన్‌బజార్ అబిడ్స్,నాంపల్లి ,బషీర్‌బాగ్, లక్డీకపూల్ , హిమాయత్‌నగర్, నారాయణగూడ ప్రాంతాల్లోనూ వర్షం ఎడతెరిపి లేకుండా పడింది.అలాగే ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లోకి వచ్చిన పర్యాటకులు వర్షానికి తడిసి ముద్దయ్యారు. స్కూళ్లు, ఆఫీసులకు వెళ్లే వాహనదారులు వర్షంలో తడుస్తూనే వారి వారి గమ్యస్థానాలు చేరుకున్నారు. కాగా రుతుపవణాల ప్రభావంతో రాగల రెండురోజులు గ్రేటర్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వానలు కురిసే అవకాశాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

**నిండుకుండలా జంట జలాశయాలు ..**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జంటజలాషయాలు నిండుకుండలా మారాయి. ఉస్మాన్ సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1790 అడుగులు కాగా ..ప్రస్తుతం 1779 అడుగులకు చేరుకుంది. హిమాయత్‌సాగర్ ఇన్‌ఫ్లో 1666 క్యూసెక్కులు కాగా ...ఓట్‌ఫ్లో నిల్. హిమాయత్‌నగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1763 అడుగులు కాగా ..ప్రస్తుతం 1755 అడుకులకు చేరుకుంది.అలాగే హుస్సేన్‌సాగర్‌లోకి వరదనీరు భారీగా వస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తూములను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. హుస్సేన్‌సాగర్ నీటిమట్టం 513.41 కాగా 513.23కు చేరింది. దీంతో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

**అప్రమత్తమైన జిహెచ్‌ఎంసి ...**

వాతావరణశాఖ హెచ్చరికల దృష్టా నగరంలో కురుస్తు వర్షాల నేపథ్యంలో జిహెచ్‌ఎంసి అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తమై ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. నగర వ్యాప్తంగా కురిసిన వర్షంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు, స్టాటిక్ బృందాలు రంగంలోకి దిగి నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఆయా విభాగాల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నారు. ఎప్పటికప్పుడు వాతావరణశాఖ హెచ్చరికలను నగర ప్రజలకు తెలియజేస్తూ అప్రమత్తం చేస్తున్నారు. వర్షాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అలాగే వాటర్ లాగిన్ పాయింట్‌ల వద్ద నిలిచిన నీరును తొలగించేందుకు 238 స్టాటిక్, 154 మాన్‌సూన్ ఎమర్జెన్సీ మృందాలను జిహెచ్‌ఎంసి ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.. వాటికి తోడు హైడ్రా ద్వారా 30, సిఆర్‌ఎంపి ద్వారా 29 మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు నిరంతరం క్షేత్రస్థాయిలో వాటర్ లాగిన్ పాయింట్ల వద్ద నిలిచిన నీటిని ఎప్పటికపునపడు క్లీయర్ చేస్తున్నారు.

## హుస్సేన్‌సాగర్‌లో ముగిసిన మాన్‌సూన్ రెగట్టా పోటీలు



వివిధ విభాగాల్లో గెలుపొందిన విజేతలు

**హైదరాబాద్,జూలై 20,ప్రభాతవార్త:** మాన్‌సూన్‌రెగట్టా పోటీలు విజయవంతంగా ముగిశాయి. చివరిరోజు శనివారం హుస్సేన్‌సాగర్‌లో చినుకుల మధ్య సెయిలర్లు పోటీ పడ్డారు. ఊహించినట్లుగానే తెలంగాణకు చెందిన గోవర్ధన్ పల్లార ,దీక్షిత కొమరవెళ్ళి చివరి రేసులో సునాయసంగా దూసుకెళ్ళి అండర్ 16 అప్టిమిస్ట్ బాలుర, బాలికల బంగారు పతకాలు, ట్రోఫీలు సొంతం చేసుకున్నారు. అండర్ 16 బాలుర అప్టిమిస్ట్ బాలుర విభాగంలో గోవర్ధన్ పల్లార మాన్‌సూన్ రెగట్టా ట్రోఫిని , అత్యంత నిలకడైన సెయిలర్‌గా ఎస్‌హెచ్‌బాబు ట్రోఫిని, బాలుర బంగారు పథకాన్ని గెలుచుకున్నాడు. దాంతో మాన్‌సూన్ రెగట్టాలో అరుదైన ట్రిపుల్ ధమాకా సాధించాడు. "అండర్ 16లో ఇది నా చివరి సంవత్సరం. ఈఏడాది డిసెంబర్‌లోపు భారతదేశానికి కొన్ని అంతర్జాతీయ టోర్నిల్లో ప్రతినిథ్యం వహించాలని అశిస్తున్నా "అని గోవర్ధన్ చెప్పాడు. బాలుర విభాగంలో మైరూర్‌కు చెందిన అకాష్ తంగై ,తెలంగాణకు చెందిర రిజ్వాన్ మమ్మాద్ వరుసగా రజతం, కాంస్యం గెలుచుకోగా బాలికల్లో తమిళనాడుకు చెందిన శ్రేయా కృష్ణ రజతం, మధ్యప్రదేశ్‌కు చెందిన షగ్రూన్‌ఝూ కాంస్య సాధించారు. కాగా అండర్ 18 విభాగంలో ఉత్తమ సింగిల్ హ్యాండర్ ఐఎల్‌సిఏ 5 బాలికల ట్రోఫిని ఒడిశాకు చెందిన అలియా సబ్రీన్ గెలుచుకోగా, బాలుర ట్రోఫిని మధ్యప్రదేశ్‌కు చెందిన అక్షత్ దోహ్రే కైవసం చేసుకున్నాడు. అండర్ 18 ఉత్తమ డబుల్ హ్యాండర్ ట్రోఫిని టిఎస్‌సి మైసూర్‌కు చెందిని నిఖిల్ మాండవ్కర్ -సత్యం ఝూ ద్వయం గెలిచారు. 420 అంతర్జాతీయ ఓపెన్ విభాగంలో తెలంగాణకు చెందిన తనుజా కామేశ్వర్ -గనేష్ పీర్కట్ల , మధ్యప్రదేశ్ సెయిలర్లు దివయాన్షి మిశ్రా -తొలిరెండు స్థానాలతో స్వర్ణం, రజతం అందుకున్నారు.

## సనత్‌నగర్ ఇన్స్‌పెక్టర్ పురంధరెడ్డి సస్పెన్షన్

**సంజీవరెడ్డి నగర్, జూలై 20, ప్రభాతవార్త**

సనత్‌నగర్ ఇన్స్‌పెక్టర్ పురంధరెడ్డి సస్పెండ్ చేస్తూ శనివారం సైబరాబాద్ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మహిళ పట్ల అసభ్య చాటింగ్ చేసారని, బాధితురాలు సైబరాబాద్ సీపీని ఆశ్రయించి సీఐ చేసిన చాటింగ్ సీపీకి చూపించింది. అందంగా ఉన్నావు, చెప్పిన ప్లేస్‌కి రావాలి అంటూ సీఐ మేసేజ్‌లను చూపింది. ఈ మేరకు పురంధరెడ్డి సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.




సనత్‌నగర్ ఇన్స్‌పెక్టర్ పురంధరెడ్డి

## ఎంఎంటిఎస్ రైళ్లు బంద్

**తార్నాక, జులై 20 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల నేపథ్యంలో రెండు రోజుల పాటు ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్యరైల్వే అధికారులు పేర్కొన్నారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో కొనసాగుతున్న ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ స్టేషన్ గుండా రాకపోకలు సాగించే ఎంఎంటీఎస్ రైళ్లను నిలిపివేశారు. మొత్తం 11 రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.









# నేడే శ్రీఉజ్జయినీ మహాకాళీ జాతర

**-బంగారు బోనం సమర్పించనున్న సిఎం రేవంత్‌రెడ్డి**

**-భక్తుల రద్దీ దృష్ట్యా పటిష్టమైన ఏర్పాట్లు**

**-అడుగడుగునా సిసి కెమెరాల నిఘా**

**బేగంపేట జులై 20ప్రభాతవార్త**

ఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతర నేడు అంగ రంగ వైభవంగా ప్రారంభం కానుంది.ఈ జాతరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు,జంట నగరాల ప్రజలు దేశ విదేశాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలి రానున్నారు.ఈ మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ తో పాటు పలు ముఖ్య శాఖలు ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేసారు. ఆలయానికి వచ్చే భక్తుల రక్షణ కోసం పోలీసులు పటిష్టమైన జాగ్రత్తలు చేపట్టారు. ప్రతి ఏటా ఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతరకు వచ్చే భక్తుల కంటే ఈ ఏడాది మహిళలు అధిక సంఖ్యలో తరలి వస్తారన్న ఉద్దేశ్యంతో పటిష్టమైన ఏర్పాట్లు చేసారు.దేవాలయ ప్రాంగణంలో కలకత్తా డెకరేషన్‌తో ప్రత్యేక మైన వాటర్ ప్రూఫ్‌తో షెడ్ ఏర్పాటు చేసారు.ఆలయాన్ని రంగు రంగుల పూలతో సుందరంగా అలంకరించారు.ఇప్పటికే ఆలయంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాలన్నింటినీ కవర్ చేస్తూ పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో జాతరంతా నిఘా నీడలో సాగనుంది.ఆదివారం ఆషాడ బోనాల ఉత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం గం 3.30నిలకు అమ్మ వారికి బంగారు బోనం సమర్పిస్తారని,గం 4కు మహాహారతి అనంతరం సాధారణ భక్తులకు దర్శనం ప్రారంభమవుతుంది.ఈ బోనాల ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేవలం 30నిమిషాల్లో దర్శనం చేసుకుని బయటకు వచ్చే విధంగా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.అర్ధరాత్రి వరకు దర్శనం ఉంటుందన్నారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వచ్ఛంద సంస్థల సభ్యుల సహాకారం తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. శుక్రవారం రోజున పెద్ద ఎత్తున భక్తులు అమ్మ వారి దర్శనానికి పోటెత్తడంతో రద్దీని దృష్టిలో ఉంచుకొని మరింత జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు.దేవాలయం చుట్టూ తాగునీరు,వైద్యశిభిరాలు,విస్తృతమైన బందోబస్తు ఏర్పాటు చేసారు. వృద్దులు,వికలాంగులకు వీల్‌ఛైర్లు,బ్యాటరీ కార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.బోనాలతో వచ్చే వారికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసారు.మొత్తం 6క్యూలైన్లు ఏర్పాటు చేసారు.వీటిలో సాధారణ భక్తులకు 2.ప్రత్యేక పాసులతో వచ్చే వారికి 2,బోనాలతో వచ్చే వారికి 2క్యూలైన్లు ఏర్పాటు చేసామన్నారు.శివసత్తులు,జోగినులకు ప్రత్యేక సమయం గం 1.30నిల నుంచి గం 4ల వరకు కేటాయించామని వారు బాటా పాయింట్ నుంచి నేరుగా రావాల్సి ఉంటుందన్నారు.సుమారు 1500 మందితో భారీ బందోబస్త్,400 సీసీ కెమెరాలతో నిఘాను ఏర్పాటు చేసినట్లు వీటిని మహంకాళీ పోలీస్‌స్టేషన్ లోని జాయింట్ కంట్రోలు రూమ్‌కు అనుసంధానం చేసి అనుక్షణం పర్యవేక్షిస్తున్నట్లు నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ తెలియజేసారు.



ఆలయానికి వస్తున్న మంత్రి పొన్నం,రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్,దీపాదాస్‌మున్షీ తదితరులు.



**శనివారం అమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు.....**

శనివారం రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మ వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.అమ్మ వారి ఆషాడ బోనాల జాతర మొదలైన నాటి నుంచి శనివారం వరకు అమ్మ వారి దర్శనానికి భక్తుల జాతర కొనసాగుతూనే ఉంది.ఉదయం నుంచి అమ్మ వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో పాటు అమ్మ వారికి ఒడిబియ్యం,బోనాలు సమర్పించేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలి వచ్చారు.

## వరుస చోరీలు...జనం బెంబేలు

**హయత్‌నగర్, జులై 20 ప్రభాతవార్త:** వరుస దొంగతనాలతో హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ మునుగనూర్ గ్రామపరిధి శ్రీనగర్ టౌన్‌షిప్‌లో నివాసముండే శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 16న షిర్డీకి వెళ్లాడు. గురువారం రాత్రి ఇంటికి తిరిగివచ్చిన అతనికి ఇంటి తలుపు గడియ విరగొట్టి ఉండడం కన్పించింది. లోనికి వెళ్లి చూడగా... బీరువాలోని 4.5 తులాల బంగారు ఆభరణాలు కన్పించలేదు. అదే గ్రామం గ్రీన్‌హోమ్స్ కాలనీలో ఉంటున్న ఆదిత్య ఈనెల 15న ఇంటికి తాళంవేసి కొండాపూర్‌లోని దగ్గరి బంధువుల ఇంటికి వెళ్లాడు. గురువారం సాయంత్రం వచ్చి చూసేసరికి ఇంట్లోని బీరువా తెరిచి ఉంది. అందులోని 4 తులాల బంగారు ఆభరణాలు, వెండివసువులు, ల్యాప్‌టాప్‌లు, పట్టుచీరలు కన్పించలేదు. ఈమేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా... అదేకాలనీలో మరో ఇంట్లో చోరీకి యత్నించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్...**

నగర శివారు ప్రాంతాల్లోని తాళం వేసి ఉన్న ఇళ్లను దోపిడీ దొంగలు లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. గతనెల కుంట్లూర్ గ్రామపరిధిలోని ప్రజయ్‌గుల్మోహర్‌లో ఐదిళ్ల తాలాలు పగులగొట్టి దోపిడీకి పాల్పడిన దుండగులు... అదేవారంలో ప్రియదర్శిని కాలనీలో రెండిళ్లల్లో చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. ఉదయం వేళల్లో కాలనీల్లో సంచరిస్తూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి వేళ సదరు ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నారు. వరుస దొంగతనాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇంటికి తాళం వేసి వెళ్లే పరిస్థితుల్లో విలువైన వస్తువులు, నగదును తెలిసిన వాళ్లకు అప్పగించడం కానీ బ్యాంకుల్లో గానీ ఉంచాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల విషయమై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వారు సూచించారు.

## మహేశ్వరం నియోజకవర్గంలో మరోసారి ప్రోటోకాల్ రగడ



ఆందోళనకు దిగిన బిఆర్ఎస్, బిజెపి కార్పొరేటర్లకు నచ్చజెపుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

**-మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో బడంగ్‌పేట్ బిఆర్ఎస్, బిజెపి కార్పొరేటర్ల ఆందోళన**

**-సభను బహిష్కరించి నిరసన వ్యక్తం చేసిన కార్పొరేటర్లు**

**సరూర్‌నగర్, జూలై 20 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని మహేశ్వరం నియోజకవర్గంలో మరో సారి ప్రోటోకాల్ రగడ చెలరేగింది. ఇటీవల ఎన్టీఆర్ నగర్‌లోని ఖిలా మైసమ్మ దేవాలయం వద్ద బోనాల పండుగ చెక్కుల పంపిణీ సందర్భంగా ప్రోటోకాల్ పాటించకుండా తనను అవమానపరిచారని స్థానిక ఎమ్మెల్యే, మాజీ విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఏకంగా సభా వేదిక వద్ద బైఠాయించి ధర్నా చేసి వారం తిరగక ముందే అదే నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మరో సారి ప్రోటోకాల్ గొడవ రేగింది. ఈ సారి సాక్షాత్తు శాసనసభ వ్యవహారాలు, ఐటి శాఖా మంత్రి అయిన రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సమక్షంలోనే బిఆర్ఎస్, బిజెపి కార్పొరేటర్లు వేదిక ముందు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. కార్పొరేషన్‌లోని వివిధ వార్డుల్లో రూ.38 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి బడంగ్‌పేట్‌లోని కార్పొరేషన్ ఆఫీస్ ఎదురుగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీధర్ బాబు శనివారం ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. అదే సమయంలో రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ బృందం కలిసే కార్యక్రమం ఉండడంతో స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరుకాలేదు. అయితే శంకుస్థాపన అనంతరం కార్పొరేషన్ ముందు స్థానిక మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ప్రోటోకాల్ వివాదం చెలరేగింది. తమను ముందుగా వేదికపైకి పిలవకుండా మాజీ ఎమ్మెల్యేలు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, ఆదిభట్ల మున్సిపల్ ఛైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డిలను పిలవడం అదీ గాక వేదికపై పలువురు కాంగ్రెస్ నాయకులు చేరడంతో బిఆర్ఎస్, బిజెపి కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. అధికారిక కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించకపోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సభకు అంతరాయం జరుగడంతో స్పందించిన సభాధ్యక్షురాలు మేయర్ పారిజాత, ఆమె భర్త మాజీ వైస్ ఛైర్మన్ నర్సింహారెడ్డిలు గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇలాంటివి జరగలేదా అని వాదించి వారించారు. అయితే గొడవ సద్దుమణగకపోవడంతో కెఎల్ఆర్, టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డిలు జోక్యం చేసుకొని సర్దిజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ బిజెపి, బిఆర్ఎస్ కార్పొరేటర్లు వినకపోవడంతో సాక్షాత్తు మంత్రి శ్రీధర్‌బాబు మైక్ తీసుకొని వారికి సర్దిజెప్పే ప్రయత్నం చేశారు. చివరకు కార్పొరేటర్లు తాము సభకు బహిష్కరిస్తున్నామని చెప్పి బయటకు వెళ్ళిపోయారు. అనంతరం బిఆర్ఎస్, బిజెపి కార్పొరేటర్లు లేకుండానే శంకుస్థాపన సభ జరిగింది.

## ప్రజలంతా స్వచ్ఛందంగా మొక్కలు నాటుకోవాలి : పద్మావతి యాదవ్



బండ్లగూడ కార్పోరేషన్‌లోని 7.వ,డివిజన్‌లో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పోరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్.

**నార్సింగి, జూలై 20 ప్రభాతవార్త :** ప్రజలంతా తమ ఇళ్ల ముందు స్వచ్ఛందంగా మొక్కలు నాటుకోవాలని బండ్లగూడ జాగీర్ 7.వ,కార్పోరేటర్ క్యాతం పద్మావతి పాపయ్య యాదవ్ పేర్కొన్నారు. శనివారం తన వార్డు పరిధిలోని పలు కాలనీలలో ఇంటింటికి తిరిగి మొక్కలు పంపిణీ చేశారు. అలాగే ఇంటిలోని టైర్లు, కుండీలలో నీరు, చెత్త నిలువ ఉండకుండా చూడాలని ప్రజలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన తల్లిదండ్రులు, బిడ్డల పేర్లపై మొక్కలు నాటుకోవాలని, వాటిని మూడేళ్ల పాటు సంరక్షిస్తే అవి మనకు జీవితాంతం ప్రాణ వాయువును ఇస్తాయని తెలిపారు. వాతావరణంలోని కాలుష్యంను తగ్గించాలంటే విధిగా అందరం మొక్కలు పెంచాలని సూచించారు. పూర్వం ప్రతీ ఇంటి ముందు ప్రాణ వాయువునిచ్చే ఐదారు చెట్లు ఉండేవని, ఇప్పుడు చెడు వాయువులను విడుదల చేసే ఐదారు వాహనాలుంటున్నాయన్నారు. మన పూర్వీకులు నాటిన చెట్లు నరికి వేస్తూ, కొత్తవి నాటకపోవడం వలన వాతావరణంలో కాలుష్యం పెరిగి సకాలంలో వర్షాలు కురువడం లేదని, భూతాపం పెరిగి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ నీటి మట్టం పెరుగులన్నా, సకాలంలో వర్షాలు కురువాలన్నా, కాలుష్యంను తగ్గించుకోవాలన్నా అందరం విధిగా మొక్కలు నాటుకోవాలని పద్మావతి యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజే యాదవ్, వెంకటేష్ యాదవ్, ఇమ్రాన్, బ్రహ్మారెడ్డి, మల్లారెడ్డి, కేశవ, సురేష్, అశోక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**నార్సింగి, జూలై 20 ప్రభాతవార్త :** ఐదేళ్ల పాటు మణికొండ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించి, బదిలీపై వెళ్తున్న ఐదుగురు ఉపాధ్యాయులను శనివారం పుర ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ సమాజోద్ధారకులను తయారు చేసే బాధ్యత గురువులదని పేర్కొన్నారు. చిన్నారులకు అక్షరాలు దిద్దించి, మన చరిత్ర, పోటీ చదువులు, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవ భావం, ఆపదలలో ఉన్న వారిని ఆదుకోవాలన్న సద్గుణాలను ఉపాధ్యాయులే ఒంటబట్టిస్తారన్నారు. మంచి సమాజం ఉందంటే అందుకు కారణంగా ఉపాధ్యాయుడేనని తెలిపారు. నిత్య విద్యార్థిగా రోజూ కొత్త విషయాలు తెలుసుకొని, పాఠ్య పుస్తకాలలోని అంశాలను చదువుకొని విద్యార్థులకు అర్థం అయ్యేలా బోధనలు చేసే వారు ఉపాధ్యాయులన్నారు. బాలల వ్యక్తిత్వ వికాసంతో పాటు మంచి చదువును చెప్పే ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తుంటే గుండెలు బరువెక్కుతాయన్నారు. మణికొండ పాఠశాలలో ఐదేళ్ల పాటు పనిచేసి, అదనపు తరగతులు విద్యార్థులకు బోధించి ఉత్తీర్ణతా శాతంను పెంచేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు విద్యార్థుల తరపున ప్రత్యేక ధన్యావాదాలు తెలుపుతున్నామని నరేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వసంత్ చౌహాన్, ప్రధానోపాధ్యాయులు నిరంజన్, నాయకులు బీరప్ప,ఏర్పులకుమార్, గంగాధర్, శ్రవణ్, రాజేష్ పాల్గొన్నారు.

## మన సంస్కృతి సాంప్రదాయాలను పిల్లలకు నేర్పించాలి



బోనాల వేడుకలు నిర్వహిస్తున్న ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ విద్యార్థులు

**ముషీరాబాద్, జూలై 20, ప్రభాతవార్త:** మన సంస్కృతి, సాంప్రదాయాలను చిన్నతనం నుండే పిల్లలకు నేర్పించాలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్, ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కవాడిగూడలోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ నందు విద్యార్థులతో బోనాల వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మన పండుగల వెనుక ఎంతో శాస్త్రీయత దాగి ఉందని, అటువంటి పండుగలు మరుగున పడకుండా కాపాడుకోవల్సిన బాద్యత మనందరిపైనా ఉందని అన్నారు. ఇంగ్లీష్ యూనియన్ పాఠశాలలో విద్యార్థులకు అన్ని పండుగల పట్ల అవగాహన కల్పిస్తూ కుల మతాలకు అతీతంగా అన్ని పండుగలను, జాతీయ వేడుకలు నిర్వహిస్తూ ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ పి.స్వర్ణలత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేవాలయాల కమిటీల ప్రతినిధులకు చెక్కులు పంపిణీ



పాతబస్తీలోని దేవాలయాల కమిటిల ప్రతినిధులకు చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**చార్మినార్,జూలై 20 ప్రభాతవార్త :** ఆషాడ మాసం సందర్భంగా శనివారం మీరాలంమండిలో రాష్ట్ర దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ,అసిస్టెంట్ కమిషనర్ బాలాజీతో పాటు చార్మినార్ మండలం తహసీల్దార్ నిహారికలు కలిసి పాతబస్తీలోని పలు దేవాలయాల కమిటి ప్రతినిధులకు చెక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఊరేగింపు కమిటి చైర్మన్ గాజుల అంజయ్య,ప్రతినిధులు,రాకేష్ తివారీ,మధుసూధన్ యాదవ్,అనంతోజ్ హంసరాజ్,కె.ఎస్.ఆనంద్‌రావు,కైలాస్ ముదిరాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### ప్రముఖ కథా రచయిత్రి డా.మృణాళినికి ఆత్మీయ సత్కారం

**చిక్కడపల్లి, జూలై 20 ప్రభాతవార్త:** రాగరాగిణి సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కారగ్రహీత, పద్మభూషణ్ డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా ప్రముఖ కథా రచయిత్రి డాక్టర్ సి.మృణాళికి ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని 26న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో నిర్వహించబోతున్నట్లు సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి.రమణకుమారి, ఎంవి.సుబ్బలక్ష్మి వివరించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ పూర్వసలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి హాజరై సత్కరించే ఈ సభకు దక్షిణమద్యరైల్వే పూర్వ జనరల్ మేనేజర్ సి.రామకృష్ణ అధ్యక్షత వహిస్తారని, కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి తదితరులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని 'సంగీత సాహిత్య సమలంకృతే' పేరుతో సినారె సినీగీత విభావరి ఉంటుందని, ఎం.వి.రమణకుమారి స్వరసారధ్యంలో గాయనీ గాయకులు ఎంఆర్.శశిరేఖ, స్వర్ణమంగళంపల్లి, పి.విజ యకుమార్, ఎన్.బి.ఖాసీమ్, వి.ప్రభాకరరావు, అంబాదాస్, కె.సుధాకర్ గానం చేస్తారని, వ్యాఖ్యాతగా ఎం.ఆనంద్ వ్యవహరిస్తారన్నారు.

## బ్రాహ్మణులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవీలత

**సైఫాబాద్, జులై 20 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను నిర్లక్ష్యం చేయడం తగదని బిజెపి నాయకురాలు మాధవీలత చెప్పారు. బ్రాహ్మణులకు అనేక హామీలు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా కాలయాపన చేయరాదని సూచించారు. బిజెపి తెలంగాణ ఎండోమెంట్ సెల్ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన బ్రాహ్మణుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వివేకానంద విదేశీ విద్య పథకం కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణ విద్యార్థులకు విదేశీ విద్యకు అవకాశం కల్పించి ఒక్క ఏడాదికి మాత్రమే ఫీజుల రీయంబర్స్‌మెంట్ చెల్లించిందని, ఆ తరువాత డబ్బులు చెల్లించకుండా వదిలి వేయడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, తక్షణమే రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ స్థితిగతులపై ప్రభుత్వం దృషి పెట్టాలని, చిన్న వ్యాపారాలు చేసుకునే మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబాల ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, పురోహిత, దూపదీప నైవేద్య పథకంపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. తెలంగాణ బ్రాహ్మణ పరిషత్‌కు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని, మ్యానిఫెస్టోలో పేర్కొన్న పథకాలను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా అఖిల భారత బ్రాహ్మణ అర్చక సేవ సమాఖ్య అధ్యక్షుడు రాహుల్ దేశ్ పాండే ఈ సమావేశంపై అగ్రహం వ్యక్తం చేశారు. రౌండ్ టేబుల సమావేశం అని చెప్పి ఏకపక్షంగా సమావేశం నిర్వహించడం అన్యాయమని ఆయన ప్రశ్నించారు. దీంతో సమావేశంలో కొద్ది సేపు ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ సమావేశానికి సెల్ కన్వీనర్ సూర్యప్రకాష్ అన్నా వజుల అధ్యక్షత వహించగా, వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులు మంగపతిరావు, విజయసాయి, గీతామూర్తి, విజయలక్ష్మి , శర్మ, కప్పర ప్రసాద్, రాజేశ్వరశర్మ, భాస్కరభట్ల రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

## స్మశానవాటికల నిర్మాణానికి కృషి

**-రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపన్ జాన్**



చైర్మన్ దీపన్ జాన్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్(టియుసిపిఎ) ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్ బృందం

**చిక్కడపల్లి, జూలై 20 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంతో పాటు చుట్టు ప్రాంతాలలో క్రిస్టియన్‌లకు సంబంధించి స్మశాన వాటికలను ఏర్పాటు చేయడానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపన్ జాన్ హామీ ఇచ్చారు. త్వరలోనే పరిష్కరిస్తానని చెబుతూ, రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేసేలా కృషి చేస్తానన్నారు. శనివారం తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన(టియుసిపిఎ) ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్ ఆధ్వర్యంలో టిసిసిబిజి కమిటీ సభ్యులతో కలిసి దీపక్ జాన్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బిషప్ సింగం, పిఎస్.సురేశ్ మనోహర్, రెవరెండ్ నవీన్, రెవరెండ్ జైసన్, ప్రభాకర్, బెనోనీ రిచర్డ్, ప్రేమ్‌సాగర్, ప్రమోద్, కెన్నడీ, సంజీద్ దేను తదితరులు పాల్గొన్నారు.

### హెబ్రోన్‌చర్చ్ గవర్నింగ్‌బాడీ ప్రతినిధి మోహన్ బెన్‌రాజ్ మృతి

**చిక్కడపల్లి, జూలై 20 ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బ్రదర్ భక్తసింగ్ స్థాపించిన హెబ్రోన్ సొసైటీ గవర్నింగ్ బాడీ కోశాధికారి, సంఘం పెద్దదిక్కు బ్రదర్ మోహన్ బెన్‌రాజ్(78) తీవ్ర అనారోగ్యంతో గాంధీనగర్‌లో తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఫిబీ, కుమార్తె షైనీ, అల్లుడు జోయల్ ఉన్నారు. అనంతపురం, హిందూపూర్‌కు చెందిన మల్లెల కృష్ణారావు-సరోజినీల ప్రథమ కుమారుడు అయిన బెన్‌రాజ్ 1963లో ఏసుక్రీస్తును తన సొంత రక్షకునిగా స్వీకరించిన తర్వాత నంద్యాలలో దైవజనుడు సహోదరుడు భర్మజోసెఫ్ వద్ద ఆత్మీయ తర్ఫీదు పొందారు. ఉద్యోగరీత్య విజయవాడ, ఢిల్లీ, హైదరాబాద్‌లో పనిచేసిన అనంతరం కొంతకాలం బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియాలో పనిచేశారు. 1978 జూన్ 10న బ్రదర్ భక్తసింగ్ జతపనివారు అయిన బ్రదర్ అగస్టిన్ చిన్న కుమార్తె ఫిబీతో వివాహం జరిగింది. నాటి నుంచి గాంధీనగర్‌లో అర్చన అపార్ట్‌మెంట్‌లో ఉంటూ దైవ పరిచయంతో పాటు హెబ్రోన్ గవర్నింగ్ బాడీ కోశాధికారిగా సేవలందిస్తున్నారు. బెన్‌రాజ్ మృతి చెందిన వార్త తెలుసుకున్న దైవసేవకులు, విశ్వాసులు, కుటుంబ సభ్యులు హెబ్రోన్ చర్చ్‌కు వచ్చారు. భక్తుల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం నారాయణగూడంలోని క్రైస్తవ సమాదులతోటలో భూస్థాపన కార్యక్రమంల(అంత్యక్రియలు) సంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఆయన మృతి పట్ల సొసైటీ చైర్మన్ దైవసేవకుడు బ్రదర్ జోసెఫ్ పి.కురియన్‌తో పాటు గవర్నింగ్ బాడీ ప్రతినిధులు ఆర్.పీటరాచారి తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో దైవసేవకులు, విశ్వాసులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ప్రొ.కోదండరాంను కలిసిన ఓ.యూ అధ్యాపకులు



ప్రొ.కొదండరాంతో తమ సమస్యలను తెలియజేస్తున్న ఓ.యూ కాంట్రాక్ట్ అధ్యాపకులు

**తార్నాక, జులై 20 ప్రభాతవార్త:** యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం ద్వార కృషి చేయాలని ప్రొ.కొదండరాంను ఓ.యూ అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీల సమస్యలపై విద్యావేత్తలతో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సమావేశం అయిన సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్ సమస్య ఉందని విద్యావేత్తలు తెలిపిన సందర్భంగా ప్రొ.కొదండరాంకు అభినందనలు తెలిపారు. గత రెండు దశాబ్దలుగా పనిచేస్తున్న కాట్రాక్ట్ అధ్యాపకులకు సరైన వేతనాలు లేక ఉద్యోగ భద్రత లేక సమస్యలతో ఉన్నారని సీఎంకు విద్యావేత్తలు చెప్పడం ఎంతో సంతోషంగా ఉందని పలువురు అధ్యాపకులు పేర్కొన్నారు. అధ్యాపకులకు ఉద్యోగ భద్రతతో కూడిన మేలు జరుగాలని ఈ విషయాన్ని సుప్రీం కోర్టు కూడా సమర్థిస్తూ తీర్పు ఇచ్చి కారణంగా తప్పని సరిగా వారికి ఒక న్యాయం చేయాలని వారు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మరో సారి అధ్యాపకుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లతామని ఈ సందర్భంగా ప్రొ.కొదండరాం తెలిపారని అధ్యాపకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్ట్) రాష్ట్ర అధ్యక్షులు డా. ఎ.పరుశురాం, వర్కింగ్ ప్రెసిడెంట్ డా. కరుణాకర్ రావు, డా. సాదు రాజేష్, డా. ఎల్. జితేందర్, డా. మాదసి కనకయ్య, డా. ఆనంద్, డా. అర్జున్, డా. విజయ్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యరంగంలో భారతదేశానికి అనేక సవాళ్ళు

**-మాజీ హెల్త్ సెక్రటరీ సుజాతారావు**

**పంజగుట్ట, జూలై 20 (ప్రభాతవార్త):** వైద్యరంగంలో భారతదేశం అనేక సవాళ్ళను ఎదుర్కొంటుందని కానీ మన భారత వైద్యరంగ నిపుణులు వాటిని సమర్థవంతంగాఎదుర్కొంటున్నారని భారతదేశ మాజీ ఆరోగ్య శాఖ కార్యదర్శి సుజాతారావు వ్యాఖ్యానించారు. శనివారం బంజారాహిల్స్‌లో డాక్టర్స్ కాలింగ్ పుస్తకావిష్కరణలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు ఈ సందర్భంగా 2018 లో మృతి చెందిన మాజీవైద్యాధికారి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరిగిన టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకుని వైద్య సేవలను కిందిస్థాయి వరకు తీసుకుపోవాలని సూచించారు. టెలిమెడిసిన్ సేవలు అందరూ అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఇపుడు ఇండియా ఎదుర్కొంటున్న ఛాలెంజ్‌లను పుస్తక రచయిత ఎపుడో గుర్తించి అందులో పొందుపరచడం విశేషమన్నారు.జీవనవిధానం మార్చుకోవడం ద్వారా జీవన ప్రమాణాలు పెంచుకోవచ్చన్నారు. రోగి క్రమం తప్పకుండా మందులు వాడి ఆహారపు అలవాట్లను క్రమబద్ధీకరించుకోవడం ద్వారా జీవితం కాలం పెంచుకోవచ్చన్నారు. వ్యాధులు ముదరకుండా చికిత్సలు చేయించుకుంటే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు.పెరిగిన టెక్నాలజీ విధానంలో టెలీ మెడిసిన్ విధానంలో వైద్యులు మంచిఫలితాలు సాధిస్తున్నారన్నారు.డిమాండ్‌కు తగినంతగా రోగులు అవగాహన కలిగిన సర్జన్స్‌ను సంప్రదించకపోవడంతో ఎక్కువమరణాలు సంభవిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.రంగారావు రచించిన డాక్టర్ కాలింగ్ అనే పుస్తకాన్నిప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి హరీష్ అయ్యర్,వెంకట్ చెంగేవల్లి,శ్రీనాథ్‌రెడ్డి రంగారావు కుటుంబ సభ్యులు,సన్నిహితులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి

**-రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్**



ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ 11వ ఆవిర్భావ వేడుకలలో పాల్గొన్న ఎంపీ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ముషీరాబాద్, జూలై 20, ప్రభాతవార్త:** ఆర్యవైశ్యుల అభివృద్ధికై కాంగ్రెస్ ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. శనివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య ఫెడరేషన్ 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, టీపీసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్‌గుప్తాలతో కలసి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం చేసిన వివిధ జిల్లాల నఉండి వచ్చిన వంద మందిని వారు ఘనంగా సత్కరించారు. అనంతరం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ముషీరాబాద్ నియోజకవర్గ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంజి రాజమౌళి గుప్తా, కటకం శ్రీనివాస్ సరస్వతి టెంపుల్ వర్గల్ ఛైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి, ఐవీఎఫ్ రాష్ట్ర నాయకులు పబ్బా చంద్రశేఖర్,కొడిపాక నారాయణ, ముత్యాల సత్య, శ్రీధర్, గుండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**- ఎంపి మల్లు రవి**



మెట్టు సాయికుమార్‌ను సన్మానిస్తున్న ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి.

**మెహిదీపట్నం, జూలై 20, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఎం.పి మల్లు రవి అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు ఏదో ఒక రోజు తప్పకుండ గుర్తింపు లభిస్తుందన్నారు. తెలంగాణ మత్స్య సొసైటీ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మెట్టు సాయికుమార్‌కు శనివారం మాసబ్‌ట్యాంక్ మత్స్య భవన్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమంతో పాటు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎం.పి మల్లు రవి, భువనగిరి ఎం.పి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ, టిపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, గ్రంథాలయ చైర్మన్ రియాజ్, నిర్మాలా జగ్గారెడ్డిలు హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అనంతరం మల్లు రవి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మత్స్యశాఖకు అత్యధికంగా నిధులను విడుదల చేసి మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మత్స్య సొసైటీ సభ్యులు, ముదిరాజ్‌లు పెద్ద ఎత్తున పాల్గొని అభినందనలు తెలిపారు.

## విదేశాలలో చదువుకోవాలనుకునే వారికి మంచి అవకాశాలు..

**-సరైన పద్ధతిలో వెళితే అక్కడ ఇబ్బందులు ఎదురుకావు**
**-వెబ్‌స్టర్ యూనివర్శిటీ డైరక్టర్ ఇన్ రిక్రూట్‌మెంట్ అమెరికా జేమ్స్ వైగస్ వెల్లడి**

**పంజగుట్ట, జూలై 20 (ప్రభాతవార్త):** విదేశాలలలో చదువుకుని ఉద్యోగం సంపాదించాతనుకునే విద్యార్థులకు సరైన అవగాహన లేపోవడం వల్లనే అక్కడకు వెళ్ళి ఇబ్బందులు పడుతున్నారని, తల్లిదండ్రులు కూడా విదేశాలకు పంపాలంటే సరైన అవగాహన లేక భయపడుతుంటారని అలాంటివారికోసమే ఇండియాలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అమెరికాకు చెందిన వెబ్‌స్టర్ యూనివర్శిటీ ప్రతినిధిజేమ్స్‌వైగస్ వెల్లడించారు. శనివారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత విద్య చదివి విదేశాలలో ఉద్యోగం సంపాదించి ముఖ్యంగా అమెరికాలో సెటిల్ అవడానికి మంచి విద్య, ఉపాది అవకాశాలుమెండుగా ఉన్నాయన్నారు. ఇండియాలో ఒక ఉన్నత విద్య చదవడానికి ఎంత ఖర్చు అవుతుందో అమెరికాలో కూడా కాస్తఅటూ ఇటూగా అంతే అవుతుందని తెలిపారు. అమెరికాలో చదువుకోవడానికి, తర్వాత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించేవిధంగావెబ్‌స్టన్ విశ్వవిద్యాలయం ప్రత్యేక ప్రణాళికను తయారు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా విద్యార్ధి చదుకుకోవడానికి విదేశాలలోలభించే స్కాలర్‌షిప్‌లపై అవగాహన కల్పించడంతో పాటు వీసా ప్రాసెస్ దగ్గర నుండి అన్ని విధాలా తాము సహాయ సహకారాలుఅందిస్తామని తెలిపారు. తమకు అమెరికాలో మూడు రాష్ట్రాలలో క్యాంపస్ లున్నాయని, అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన ఇక్కడతాము విదేశీ విద్యార్థులను చేర్చుకోవడం జరుగుతుందన్నారు.తమ వద్దకు వచ్చిన వారికి సరైన విద్యను అందించడంతో పాటు చదువు అయిపోయిన తర్వాత ఉద్యోగం ఎలా సంపాదించాలనే విషయంలో కూడా విద్యార్థులకు సరైన అవగాహన కల్పించడంతోపాటు గైడెన్స్ కూడా అందించడం జరుగుతుందన్నారు.

సమావేశంలో అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ సమ్రత్‌రాయ్ చౌధురి తదితరులు పాల్గొన్నారు.

## హిమాయత్ సాగర్ కట్టమైసమ్మకు మేయర్ లతాగౌడ్ పూజలు



హిమాయత్ సాగర్ జలాశయం కట్టపై ఉన్న మైసమ్మకు ప్రత్యేక పూజలు చేసిన బండ్లగూడ జాగీర్ మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ తదితరులు.

**నార్సింగి, జూలై 20 ప్రభాతవార్త :** వేగంగా హిమాయత్ సాగర్ జలాశయం నిండేలా భారీ వర్షాలు కురిపించాలని కోరుతూ కట్టమైసమ్మ అమ్మవారికి బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పోరేటర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు పూర్తవుతున్నా, ఇప్పటి వరకు ఆశించిన వర్షాలు కురువలేదని, హిమాయత్ సాగర్ జలాశయంలోకి ఒక్క చుక్క కొత్త నీరు వచ్చి చేరలేదన్నారు. దశాబ్దాలుగా రాజధాని హైదరాబాద్ ప్రజల దాహార్థిని తీరుస్తున్న హిమాయత్ సాగర్ జలాశయం నిండేలా భారీ వర్షాలు కురిపించాలని జలాశయం కట్టపై ఉన్న మహిమాన్విత మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశామన్నారు. గండిపేట, హిమాయత్ సాగర్ జలాశయాలు నిండుగా ఉంటే గండిపేట మండలంలోని అన్ని గ్రామాలలో బోర్లలో నీరుంటుందన్నారు. వీటిలో నీరు తగ్గితే ఇళ్లల్లోని బోర్లు వట్టిపోయి ఇక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతారన్నారు. ప్రజలను నీటి ఇబ్బందుల నుంచి తప్పించాలంటే భారీగా వర్షాలు కురిసి, జలాశయాలన్నీ నిండుకుండల్లా మారాల్సిన అవసరం ఉందని, అందుకే అమ్మవారికి పూజలు చేశామని వివరించారు. ఈ పూజలు నిర్వహించిన వారిలో కార్పోరేటర్లు ముద్దం రాము, ప్రశాంత్ నాయక్, అస్లాం, నాయకులు గోపాల్ ముదిరాజ్, నరేందర్‌బాబు, సయ్యద్ ఖాజా, టింకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓ.యూలో ముగిసిన జాతీయ వాణిజ్య సదస్సు

**తార్నాక, జులై 20 ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న వాణిజ్య...2024 సదస్సు శనివారం ముగిసింది. ఈ ముగింపు సదస్సుకు ఓ.యూ ఓఎస్డీ ప్రొ.రెడ్యా నాయక్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్తులకు సూచించారు. ఈ సదస్సు నిర్వాహకులను ప్రత్యేకంగా ఆయన అభినందించారు. ఈ సదస్సుకు హాజరైన రెండు ప్రముఖ ఎంఎన్‌సి కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ ఎంకాం విద్యార్థులకు ఇంటర్నషిప్ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామినిచ్చారు. ఈ సందర్భంగా జెస్టప మినిట్ పేరుతో క్విజ్, కేస్ స్టడీస్, పోస్టర్ ప్రదర్శన ఇలా మొత్తం 15 అంశాల్లో విద్యార్థులకు పోటీలను నిర్వహించారు.

అనంతరం ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు జ్ఞాపికలను అందజేశారు. ఈ సదస్సులో స్వాగతోపన్యాసాన్ని కామర్స్ హెడ్ ప్రొ.చెన్నప్ప చేయగా కామర్స్ బివోఎస్ ప్రొ.క్రిష్ణ చైతన్య, డీన్ ప్రొ.గంగాధర్, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.నరేష్ రెడ్డి సదస్సు కన్వీనర్ ఇంద్రకంటి శేకర్‌తో పాటు 18 కళాశాల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

### గండిపేటలో స్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని వినతి

**నార్సింగి, జూలై 20 ప్రభాతవార్త :** గండిపేట గ్రామంలో స్మశాన వాటికలకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు నార్సింగి మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్, పుర ప్రముఖులు ప్రశాంత్ యాదవ్‌లు వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం గండిపేట గ్రామంలో 10.వేల మంది ప్రజలు నివసిస్తున్నారని, వీరి భవిష్యత్తు అవసరాల నిమిత్తం హిందూ, ముస్లీం మతాలకు సంబంధించి రెండు స్మశాన వాటికలకు స్థలాన్ని కేటాయించాలని కోరామన్నారు. సర్వే నెంబర్లు 18, 45.లలో ఉన్న ప్రభుత్వ భూమిని కేటాయించి, గత అసెంబ్లీ ఎన్నికలలో గండిపేట ప్రజలకు మీరిచ్చిన హామీని నెరవేర్చాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కోరినట్లు వివరించారు. గత పదేళ్ల కాలంలోనే గండిపేట గ్రామంలో విపరీతమైన జనాభా పెరిగిపోయిందని, ప్రభుత్వంకు ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు సరిపడ మౌళిక వసతులు కల్పించడం కూడా ప్రజా ప్రతినిధులుగా మన బాధ్యత అని, స్మశాన వాటికలకు స్థలంను వీలైనంత త్వరగా కేటాయించాలని కోరడం జరిగిందన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గండిపేట ప్రజలకిచ్చిన హామీ గుర్తుందని, స్మశాన వాటికలకు స్థలం కేటాయింపు అంశంపై ఉన్నతాధికారులను కలుస్తానని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని తెలిపారు. ఎమ్మెల్యే స్పందన పట్ల నాయకులు వెంకటేష్ యాదవ్, ప్రశాంత్ యాదవ్, సయ్యద్ అసద్, మహ్మద్ నజీర్, అఫ్రోజ్‌ఖాన్, అంజద్, జకీర్, మహ్మద్ అశు సంతోషంను వ్యక్తం చేశారు.

### జెపిఎల్ క్రికెట్ టోర్నీ జెర్సీల ఆవిష్కరణ

**హైదరాబాద్, జూలై 20, ప్రభాతవార్త:** కెయుజె జర్నలిస్టు ప్రీమియర్ లీగ్ (జెపిఎల్) జెర్సీల ఆవిష్కరణ ఘనంగా జరిగింది. శనివారం ఉదయం సికింద్రాబాద్ జింఖానా స్టేడియంలో జరిగిన ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్మోహన్‌రావు, చెన్నూరు ఎమ్మెల్యే ,హెచ్‌సిఏ మాజీ అధ్యక్షులు వివేక్ వెంకటస్వామి త్రుక్ష పుడ్స్ ఎండీ భరత్‌రెడ్డి, లైఫ్‌స్పాన్ సంస్థ హెడ్ భరణి, కెయుజె సిఈవో సంజయ్, హెచ్‌సిఏ సీనియర్ సభ్యులు ఆగం రావు, స్మయిల్‌గార్డ్ ఫౌండర్ శరత్, జూర్‌ఎల్‌ఈడి ఫౌండర్ రమేష్ ముఖ్యఅథిదులుగా హాజరై జెర్సీలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో పది మీడియా సంస్థల జట్లు పాల్గొన్నాయి.

### సందడిగా ఓ.యూ టెక్నాలజీ కళాశాల గ్రాడ్యుయేషన్ వేడుక

**తార్నాక, జులై 20 ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ కళాశాల లో శనివారం ఆడిటోరియంలో కళాశాల గ్రాడ్యు యేషన్ వేడుక ఘనంగా జరిగింది. పండుగ వాతావరణంలో విద్యార్థులకు పట్టాలను ప్రదనం చేశారు. 2020..2024 విద్యాసంత్స రంలో బీటెక్ పూర్తి చేసిన వారికి పట్టాలతో పా టు ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలను అందజేశారు. ఈ వేడుకకు కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు అధ్యక్షత వహించారు. ము ఖ్య అతిథులుగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కశ్మీర్ వైస్ ఛాన్సలర్ ప్రొ.రవీంద్రనాథ్ హాజరై మాట్లాడుతూ పట్టాలు పొందిన విద్యార్థులు దేశానికి, రాష్ట్రానికి, యూనివర్సిటీకి పేరుతీసుకొ చ్చేవిధంగా ప్రయోజకులు కావాలని పేర్కొన్నారు. టెక్నాలజీ విద్యార్థులకు అనేక అవకాశాలున్నాయన్నారు. సమాజంలో ఉన్న సమస్యలపై కూడా స్పందించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బంగారు పతకాలు, అవార్డులు, స్కాలర్ షిప్పులు, ర్యాంకులు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 116 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. మరో నలుగురి విద్యార్థులకు తొలిసారిగా బీటెక్ ఆనర్స్ డిగ్రీలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ సభ్యులు రాజమహేందర్ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొ.రమేష్‌కుమార్, ప్యాకల్టీ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొ.వీవి వసవరావు, ప్రొ.హాయవదన తధితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో హిట్ అండ్ రన్

**అత్తాపూర్ జూలై20,ప్రభాతవార్త :** హిట్ అండ్ రన్‌లో గుర్తు తెలియని యువకుడి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పరిదిలో చోటుచేసుకుంది.పోలిసులు వివరాల ప్రకారం...ఆరంఘర్ చౌరస్తా సమీపంలో ఓ యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో స్పాట్‌లో యువకుడు మృతి చెందాడని వాహనాన్ని ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోవడంతో కేసు నమోదు చేసి స్థానకంగా ఉన్న సిసి టివి పూటేజ్‌ను ఆధారంగా వివరాలు సేకరిస్తున్నట్లు వెల్లడించారు.

**DEBTS RECOVERY TRIBUNAL, HYDERABAD-2**
**1st Floor, Triveni Complex, Hotel Palace Heights Building, Abids, AT HYDERABAD.**

**O.A. No.109 OF 2024**

**Summons under sub-section (4) of Section 19 of the Act, read with sub-ule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.**

**Union Bank Of India,**
**Vs**
**Mrs Vineela Penumuchu**

**To**
**Ms Vineela Penumuchu,**
**D/o Venkatanarayana Rao, Aged 33 years, Female, H No. 2-70/2/52, Plot No.56, Chengicherla Village, Boduppal Municipality, Medipally Mandal, Medchal- Malkajgiri District, Telangana -500098.**
**& also at :**
**Ms Vineela Penumuchu,**
**D/o Venkatanarayana Rao, Aged 33 years, Female, H No. 30-1, Kanchikacharla Mandal, Kunikipadu, Chevitikallu, Krishna District- AP-521180.**
**& also at :**
**Ms Vineela Penumuchu,**
**D/o Venkatanarayana Rao, Aged 33 years, Female, Plot No. 624, H No. 8-2-293/82/A/624, Road No.35, Jubilee Hills, Near Nerus Bus Stop Hyderabad, Telangana- 500 033. ...Defendant**

**SUMMONS / SUBSTITUTED SERVICE BY WAY OF PAPER PUBLICATION**

Whereas, **O.A. No.109 of 2024** is listed before Registrar, DRT-2 On : **19-07-2024.**
Whereas the Honorable Tribunal-2, is pleased to issue summons/ notice by way of publication, on the said Application U/s 19(4) of the Act, the above O.A filed against you for recovery of debt of **Rs. 85,73,314/-** In accordance with Sub-section (4) of the Section 19 of Recovery of Debts Due to the Banks and Financial Institutions Act, 1993, you the defendants are directed as under :
I. To show cause with in thirty days of the service of the summons to you, why relief prayed should not be granted;
ii. To disclose particulars of the assets other than properties and assets specified by the Applicant under serial number 3A of the Original Application;
iii. You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the Original Application
pending hearing and disposal of the Application for attachment of the properties;
iv. You shall not be transferred by way of sale, lease or otherwise except in the ordinary course of his business any of the assets over which security interest created and / or other assets and properties specified or disclosed under serial no. 3A of the Original Application without prior approval of the Tribunal;
v. You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the Bank or Financial Institutions holding security interest
over such assets.
You are also directed to file written statement with a copy thereof furnished to the Applicant and to appear before the Registrar, Debts Recovery Tribunal-2, On **02-09-2024 at 10-30 A.M**, failing which the Application shall be heard and decided in your absence. Given under my hand and seal of the Tribunal on this the **19th Day of July 2024.**

**Signature of the Officer Authorized to issue summons.**

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

**WANTED**
★ Wanted Graduate or Inter School Assistants, Sweeper, Watchman, **Contact:** Sterling Model School. Kallakal, Medchal Road, **8019130160.**

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**తెలంగాణ ప్రభుత్వం**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన**

**నిట్ నం.07/ZCTO/CRZ/GHMC/2024-25, తేది: 20.07.2024.** పని పేరు: GHMC, సర్కిల్-6, సైదాబాద్ డివిజన్-24లో దృష్టి సంబంధిత బాధిత బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద C-137, C-138, C-139, C-140 శిధిల భవనం కూలగొట్టుట. అంచనా ధర (రూ.లక్షలలో): 3.65. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 21.07.2024 ఉ.11.00 గం. వద్ద. బిడ్స్ స్వీకరణకు చివరి తేది: 22.07.2024 ఉ.11.00 గం. వద్ద. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: శ్రీ జి. హరి కిషోర్, ZCTO, CRZ, GHMC, హైదరాబాద్, ఫోన్ నం.9849906768. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. **గమనిక:** టెండర్ ప్రకటన తేదీ తర్వాత 1% బయానా పొందవలెను. **సం/- ZCTO, CRZ, GHMC,**
**DIPR.No.1970-PP/CL/Advt/1/2024-25, తేది: 20.07.2024**

## పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత కెసిఆర్‌దే : తలసాని



డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు కెటాయింపు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**కంటోన్మెంట్, జూలై20ప్రభాతవార్త:** పేద ప్రజల సొంతింటి కళ నెరవేర్చిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వాని దేనని మాజీ మంత్రి,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. హమాలీ బస్తీకి చెందిన రేణుకకు దుండిగల్‌లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లును కెటాయించిన ఫ్లాట్ అలాట్‌మెంట్ సర్టిఫికెట్‌ను శనివారం మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు ఇల్లు కెటాయింపు జరగడం పట్ల ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా బిఆర్ఎస్ ప్రభుత్వంలో కేసిఆర్ నాయకత్వంలో అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి పేదలకు ఉచితంగా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బనీ్స లాల్‌పేట్ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు వినోద్, సురేశ్, శివ,గజ్జెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అంబర్‌పేట బోనాల జాతరకు రావాలని కిషన్‌రెడ్డికి ఆహ్వానం



